సాక్షి రంగారెడ్డి

శుక్రవారం । 14 । ఏప్రిల్ । 2023

ఎయిర్‌పోర్ట్‌లో రోబోటిక్స్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలోని జీఎమ్మార్ ఇన్నోవెక్స్ విస్తరణలో భాగంగా గురువారం రోబోటిక్స్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ని ప్రారంభించారు. కార్యక్రమానికి ఐటీశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జయేష్ రంజన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎమర్జింగ్ టెక్నాలజీస్ డైరెక్టర్ రమాదేవి లంక, జీఎమ్మార్ గ్రూప్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్‌జీకే కిషోర్ పాల్గొన్నారు.

హైదరాబాద్‌కు రెగ్యులర్ కలెక్టర్‌ను నియమించండి

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్‌కు రెగ్యులర్ కలెక్టర్‌ను నియమించాలని ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి లేఖ రాశారు. హైదరాబాద్ ఇన్‌చార్జి కలెక్టర్‌గా మేడ్చల్–మల్కాజిగిరి కలెక్టర్ అమయ్‌కుమార్ అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారని ఆయన గుర్తు చేశారు. రెండు జిల్లాల బాధ్యతల కారణంగా పూర్తి స్థాయిలో న్యాయం చేయలేకపోతున్నారని పేర్కొన్నారు.

16న 'ఆదర్శ' ప్రవేశ పరీక్ష

చేవెళ్ల: తెలంగాణ ఆదర్శ పాఠశాలల ప్రవేశ పరీక్ష ఈనెల 16న నిర్వహిస్తున్నట్లు స్థానిక పాఠశాల ప్రిన్సిపాల్ టేనావతి ఒక ప్రకటనలో తెలిపారు. 6 నుంచి 10వ తరగతి వరకు ప్రవేశాలకు సంబంధించిన ప్రవేశ పరీక్ష జరుగుతుందన్నారు. ఆదివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు 6వ తరగతి ప్రవేశ పరీక్ష, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు 7 నుంచి 10వ తరగతి వరకు పరీక్ష ఉంటుందని చెప్పారు.



న్యూస్‌రీల్

గురుకులం పరీక్ష హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోండి

మొయినాబాద్: సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో 6 నుంచి 9వ తరగతి వరకు ప్రవేశాలకోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు ప్రవేశ పరీక్ష హాల్‌టికెట్లను వెంటనే డౌన్‌లోడ్ చేసుకోవాలని రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల ప్రాంతీయ సమన్వయాధికారి శారద గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 16న ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పరీక్ష ఉంటుందన్నారు. విద్యార్థులు టీజీటీడబ్ల్యూ.గురుకులం.తెలంగాణ.గౌట్‌ఇన్ వెబ్‌సైట్‌ను సందర్శించి హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. పరీక్ష కేంద్రాల చిరునామాలను ఒకరోజు ముందే తెలుసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు దగ్గరలో ఉన్న సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను సందర్శించవచ్చన్నారు.

రేపటినుంచి ఇండోర్ స్టేడియంలో సమ్మర్ శిక్షణ

హుడాకాంప్లెక్స్: స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ, జిల్లా యువజన, క్రీడల కార్యాలయం రంగారెడ్డి జిల్లా ఆధ్వర్యంలో సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో ఈ నెల 15 నుంచి వార్షిక సమ్మర్ కోచింగ్ క్యాంపు–2023 నిర్వహించనున్నట్లు జిల్లా యువజన, క్రీడల అధికారి ఇ.వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. బ్యాడ్మింటన్, జిమ్నాస్టిక్స్, క్రికెట్, స్విమ్మింగ్, స్కేటింగ్, బాస్కెట్‌బాల్, లాన్ టెన్నిస్, అథ్లెటిక్స్, వాలీబాల్, బాక్సింగ్, కబడ్డీ, కరాటే, ఆర్చరీ, టేబుల్ టెన్నిస్‌లో అంతర్జాతీయస్థాయి అనుభవజ్ఞులైన శిక్షకులతో శిక్షణ ఇవ్వడంతో పాటు మెలకువలు నేర్పించడం జరుగుతుందన్నారు. ఆసక్తి గల వారు రెండు ఫొటోలు, ఆధార్‌కార్డు/జనన ధ్రువీకరణ పత్రంతో సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు సంప్రదించవచ్చని వెంకటేశ్వరరావు పేర్కొన్నారు.

దివ్యాంగుల ఉపకరణాలకు దరఖాస్తు చేసుకోండి

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రభుత్వం ఈ ఆర్థిక సంవత్సరం ఉచితంగా పంపిణీ చేసే వివిధ రకాల ఉపకరణాల కోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ అధికారి మోతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాకు 298 ఉపకరణాలు మంజూరైనట్టు వెల్లడించారు. ఈనెల 25వ తేదీ వరకు జిల్లా ఉన్నత స్థాయి కమిటీ దరఖాస్తులు పరిశీలిస్తుందన్నారు. కలెక్టర్ ఆమోదం పొందిన తరువాత మే 4 నుంచి 10వ తేదీ వరకు ఎంపిక చేస్తామన్నారు. రెట్రోఫిట్టెడ్ మోటరైజ్డ్ వాహనాలు, బ్యాటరీ వీల్‌చైర్స్ మాస్క్యులరీ డిస్టఫీ, స్పైనల్ కార్డు, డైసీప్లేయర్స్, 4జీ స్మార్ట్ ఫోన్లు, ట్రైసైకిళ్లు, వీల్‌చైర్స్, హియరింగ్ ఎయిడ్స్, వాకింగ్ కర్రలు, స్మార్ట్ కేన్స్, టీ ఎంఎల్ కిడ్స్ ఉపకరణాలు మంజూరైనట్టు చెప్పారు.

రుణ పంపిణీని వేగవంతం చేయాలి



ఆర్పీల సమావేశంలో మాట్లాడుతున్న మెప్మా జిల్లా పీడీ షఫీయుల్లా

ఇబ్రహీంపట్నం: వీధి వ్యాపారులకు రుణాల పంపిణీ కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) పీడీ షఫీయుల్లా ఆదేశించారు. మున్సిపల్ కార్యాలయంలో గురువారం మెప్మా ఆర్పీలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీవనోపాధి కోసం బ్యాంకుల ద్వారా వీధి వ్యాపారులకు రూ.పది వేల నుంచి రూ.50 వేల వరకు రుణాలు ఇప్పించాలన్నారు. పొదుపు సంఘాల పనితీరు మెరుగుపర్చాలన్నారు. బ్యాంకు లింకేజీతో మహిళా పొదుపు సంఘాలకు రుణాలను ఇప్పించి ఉపాధి కల్పించాలన్నారు. గత సంవత్సరం కంటే ఎక్కువ మొత్తంలో ఈ యేడు పొదుపు సంఘాలకు రుణాలను అందజేసేందుకు ఆర్పీలు కృషి చేయాలన్నారు. సెల్ఫ్ హెల్ప్ గ్రూప్‌ల్లోని సభ్యులకు వ్యక్తిగత రుణాలు పొందేలా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ యూసుఫ్, డీఎంసీ (డిస్ట్రిక్ మిషన్ కోఆర్డినేటర్) హనుమంతురెడ్డి, ఏడీఎంసీ ఉమేష్, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు పార్వతమ్మ తదితరులు పాల్గొన్నారు.



సాగర తీరాన.. తథాగతుని చెంతన



మహా దృశ్యం

అంబేడ్కర్ విగ్రహావిష్కరణ నేడు

- నెక్లెస్ రోడ్‌కు చారిత్రక శోభ

సాక్షి, సిటీబ్యూరో: సాగర తీరంలో తథాగతుడికి చేరువలోనే భారత రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మహా విగ్రహావిష్కరణకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. శుక్రవారం అంబేడ్కర్ జయంతి సందర్భంగా 125 అడుగుల విగ్రహాన్ని ముఖ్యమంత్రి కేసీఆర్ ఆవిష్కరించనున్నారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించేందుకు అంబేడ్కర్ విగ్రహ ప్రాంగణాన్ని, నెక్లెస్ రోడ్ పరిసరాలను సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. రంగురంగుల విద్యుద్దీపాలతో అలంకరించారు. కొత్తగా నిర్మించిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ నూతన సచివాలయం నుంచి తెలంగాణ అమరుల స్మారకం, అంబేడ్కర్ విగ్రహం వరకు అటు పీవీ విగ్రహం, ఇటు ఇందిరగాంధీ విగ్రహాల వరకు నెక్లెస్ రోడ్ పూర్తిగా చారిత్రక శోభను సంతరించుకుంది. విగ్రహావిష్కరణ సందర్భంగా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వేలాదిగా జనం తరలిరానున్న నేపథ్యంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా భద్రతా ఏర్పాట్లు చేశారు. వేసవి తాపాన్ని దృష్టిలో ఉంచుకొని విశాలమైన షామియానాలను సైతం ఏర్పాటు చేశారు. తాగునీటి సదుపాయాన్ని కల్పించారు. వాహనాలకు ప్రత్యేక పార్కింగ్ స్థలాలను కేటాయించారు.

బుద్ధుడి సందేశంతో..

- బౌద్ధాన్ని స్వీకరించడమే కాకుండా బుద్ధుడి బోధనలను విశ్వవ్యాపితం చేసేందుకు అనేక రచనలు చేశారు బాబాసాహెబ్. ఆ సమతామూర్తి సందేశాన్ని మరోసారి జన బాహుళ్యానికి చేరవేసేందుకే అన్నట్లుగా హుస్సేన్‌సాగర్‌లో కొలువైన బుద్ధ భగవానుడికి సమీపంలోని మహా విగ్రహమై భావి భారత స్ఫూర్తి ప్రదాతగా ఆవిష్కృతం కావడం ఎంతో విశేషం. అంబేడ్కర్ 125వ జయంతి సందర్భంగా 125 అడుగుల ఎత్తైన విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నట్లు ముఖ్యమంత్రి కేసీఆర్ 2016లో ప్రకటించిన సంగతి తెలిసిందే.
- సాంకేతిక కారణాల దృష్ట్యా కొద్దిగా ఆలస్యమైనప్పటికీ ప్రస్తుతం ఆ విగ్రహం ఆవిష్కరణకు సన్నద్ధమైంది. సుమారు 11.4 ఎకరాల సువిశాలమైన ప్రాంగణంలో ఆహ్లాదకర పచ్చదనంలో అంబేడ్కర్ మహామూర్తి దేదీప్యమానంగా వెలుగొందుతోంది. మహారాష్ట్రకు చెందిన ప్రముఖ రూపశిల్పి పద్మభూషణ్ రామ్ వి సుతార్, ఆయన కుమారుడు అనిల్ సుతార్ ఈ కళాఖండాన్ని రూపొందించారు. ఎలాంటి ప్రతికూల వాతావరణాన్నైనా తట్టుకొనేలా విగ్రహ నిర్మాణం చేశారు. పార్లమెంట్ ఆకృతిలో ఏర్పాటు చేసిన బేస్‌మెంట్ మరో ప్రత్యేక ఆకర్షణ. ఈ బేస్‌మెంట్‌లోని హాళ్లలో అంబేడ్కర్ జీవితంపై సమాచారంతో కూడిన గ్రంథాలయం, ఆయన జీవిత విశేషాలు, రాజ్యాంగ రచనా కాలం నాటి ఫొటోలు, చిత్రాలు కొలువుదీరనున్నాయి.

ట్రాఫిక్ ఆంక్షలు

- నేటి మధ్యాహ్నం 1 నుంచి రాత్రి 8 గంటల వరకు

సాక్షి, సిటీబ్యూరో: ఎన్టీఆర్ మార్గ్‌లో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని శుక్రవారం సీఎం కేసీఆర్ ఆవిష్కరించిన అనంతరం బహిరంగ సభలో ప్రసంగిస్తారు. ఈ నేపథ్యంలో హుస్సేన్‌సాగర్ చుట్టూ ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తూ ట్రాఫిక్ చీఫ్ జి.సుధీర్‌బాబు ఉత్తర్వులు జారీ చేశారు. నేటి మధ్యాహ్నం 1 నుంచి రాత్రి 8 గంటల వరకు ఆంక్షలు అమలులో ఉంటాయి. వీవీ స్టాచ్యూ, నెక్లెస్ రోటరీ, ఎన్టీఆర్ మార్గ్, తెలుగు తల్లి జంక్షన్ మార్గంలో రాకపోకలను అనుమతించరు. వీవీ స్టాచ్యూ నుంచి ఎన్టీఆర్ మార్గ్ వైపు వచ్చే వాహనాలను నిరంకారి, ట్యాంక్‌బండ్ నుంచి పీవీ మార్గ్‌కు వచ్చే వాహనాలను రాణిగంజ్ వైపు మళ్లిస్తారు. ఇక్బాల్ మీనార్ వైపు నుంచి ట్యాంక్‌బండ్ వైపు వచ్చే వాహనాలను లోయర్ ట్యాంక్‌బండ్ మీదుగా మళ్లిస్తారు. ట్యాంక్‌బండ్ నుంచి తెలుగుతల్లి జంక్షన్ వైపు వచ్చే వాటిని ఇక్బాల్ మీనార్ మీదుగా పంపిస్తారు. శుక్రవారం ఎన్టీఆర్ గార్డెన్, ఎన్టీఆర్ ఘాట్, పీవీ నరసింహారావు మార్గ్, లుంబినీ పార్క్ మూసి ఉంటాయి. ట్రాఫిక్ ఆంక్షలు, మళ్లింపుల ప్రభావం ఖైరతాబాద్, ఓల్డ్ సైఫాబాద్ పోలీసుస్టేషన్, రవీంద్రభారతి, మింట్ కాంపౌండ్, తెలుగుతల్లి, నెక్లెస్ రోటరీ, నల్లగుట్ట, కట్టమైసమ్మ, ట్యాంక్‌బండ్, లిబర్టీ జంక్షన్లపై ఉండనుంది. ఎలాంటి సహాయ సహకారాలు కావాలన్నా 90102 03626.

మార్గదర్శకాల మేరకు ధాన్యం కొనుగోలు



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ తిరుపతిరావు

- అదనపు కలెక్టర్ తిరుపతిరావు

తుక్కుగూడ: ఈ యాసంగిలో రైతులు పండించిన ప్రతి గింజనూ ప్రభుత్వం సూచించిన మార్గదర్శకాలను పాటిస్తూ ధాన్యం కొనుగోలు చేయాలని అదనపు కలెక్టర్ తిరుపతిరావు అధికారులు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో గురువారం వరి ధాన్యం కొనుగోలుపై వ్యవసాయ మార్కెటింగ్, సివిల్ సప్లయ్ అధికారులు, ధాన్యం కొనుగోలు కేంద్రాల అసోసియేషన్స్ రైస్ మిల్లర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో ప్రస్తుత యాసంగిలో 26,392,788 హెక్టార్ల భూమిలో వరి సాగైందని తెలిపారు. లక్ష 63 వేల 45 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వస్తుందని అంచనా వేశామన్నారు. జిల్లా వ్యాప్తంగా 37 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ధాన్యం సేకరణకు అవసరమైన 15 లక్షల గన్నీ బ్యాగులకు 13 లక్షల బ్యాగులు సిద్ధంగా ఉన్నాయన్నారు. ధాన్యం నాణ్యతా ప్రమాణాలు, ప్యాడీ క్లీనర్ల వినియోగం తదితర అంశాలపై వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ అధికారులు రైతులకు అవగాహన కల్పించాలన్నారు. కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకువచ్చిన రైతుల వివరాలను ఆన్‌లైన్‌లో కచ్చితంగా నమోదు చేసి టోకెన్ ఇవ్వాలన్నారు. ధాన్యం కొనుగోలుకు అవసరమైన ఎలక్ట్రానిక్ తూకం యంత్రాలు, ధాన్యం శుద్ధి యంత్రాలు, తేమ శాతం కొలిచే యంత్రాలను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. రైతులకు ఇబ్బందులు రాకుండా అధికారులు సమష్టిగా పని చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా రైతుబంధు సమితి చైర్మన్ వంగేటి లక్ష్మారెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి గీత, మార్కెటింగ్ శాఖ అధికారి ఛాయాదేవి, సివిల్ సప్లై అధికారులు మనోహర్ రాథోడ్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ సేవలు చిరస్మరణీయం



మాట్లాడుతున్న ప్రజా గాయకుడు గద్దర్

షాబాద్: పేదల అభ్యున్నతికి డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ చేసిన సేవలు చిరస్మరణీయమని ప్రజా గాయకుడు గద్దర్, అరుణోదయ కళాబృందం అధ్యక్షురాలు విమలక్క పేర్కొన్నారు. మండల పరిధిలోని కేశవగూడ, బోడంపహాడ్ గ్రామాల్లో గురువారం చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, జెడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి, రిటైర్డ్ కలెక్టర్ పీఎస్ఎన్ మూర్తి, దళిత స్త్రీశక్తి నేషనల్ కన్వీనర్ గడ్డం ఝాన్సీ, ఆఫీసర్స్ ఫోరం సిద్ధోజీరావుతో కలిసి అంబేడ్కర్ విగ్రహావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సాంకేతిక యుగంలోనూ దళితులపై దాడులు జరుగుతున్నందుకు ప్రభుత్వాలు తల దించుకోవాలన్నారు. ఎన్డీఏ ప్రభుత్వంలో దళితులు, గిరిజనులు, మైనార్టీలపై దాడులు పెరిగాయని, రాజ్యాంగ హక్కులు హరించబడుతున్నాయన్నారు. ఎమ్మెల్యే కాలె యాదయ్య మాట్లాడుతూ అంబేడ్కర్ ఆశయసాధనకోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పామెన భీంభరత్, దేశమల్ల ఆంజనేయులు మాట్లాడుతూ.. దేశంలో ఇంకా అంటరానితనం, కులవివక్ష కొనసాగడం విచారకరమన్నారు. కార్యక్రమంలో దళిత స్త్రీశక్తి తెలంగాణ రాష్ట్ర కో–ఆర్డినేటర్ భాగ్యలక్ష్మి, సర్పంచ్ కృష్ణారెడ్డి, ఎంపీటీసీ సరళ, నాయకులు యాదిరెడ్డి, రాంచంద్రారెడ్డి, ఇనాయత్, ప్రవీణ్, వెంకటేశ్, రఫీక్, కారు చెన్నయ్య పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని రక్షించుకుందాం



వాక్‌లో నడుస్తున్న కార్మికులు

- సీఐటీయూ జిల్లా కమిటీ పిలుపు

ఇబ్రహీంపట్నం రూరల్: భారత రాజ్యాంగాన్ని రక్షించుకుందామని, సామాజిక న్యాయం కోసం పోరాడుదామని సీఐటీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రాజు, చంద్రమోహన్ పిలుపునిచ్చారు. సీఐటీయూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం బొంగ్లూర్ గేట్ నుంచి తుర్కయంజాల్ ఆర్డీవో కార్యాలయం వరకు 10కే వాక్ ఫర్ సోషల్ జస్టిస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దళితులు, గిరిజనులు, మహిళలు, మైనార్టీలపై జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా పోరాటం సాగించాలన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఇటీవల దళితులపై హింస పెరిగిందని విమర్శించారు. మనువాద సిద్ధాంతాన్ని అమలు చేయాలని కేంద్రం కుట్ర పన్నుతోందన్నారు. 44 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్లుగా మార్చి కార్మికులను కట్టు బానిసలుగా చేస్తున్నారని మండిపడ్డారు. కుల వివక్షకు వ్యతిరేకంగా, సామాజిక అణచివేతకు వ్యతిరేకంగా జమిలి పోరాటం చేస్తేనే మతోన్మాదాన్ని ఓడించడం సాధ్యమవుతుందని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కోశాధికారి కవిత, ఉపాధ్యక్షుడు జగదీష్, కిషన్, రుద్రకుమార్, దేవేందర్, స్వప్న, సాయిబాబు, నాయకులు బుగ్గ రాములు, ఎల్లేష్, కురుమయ్య, ఎల్లయ్య, వీరయ్య, పాండు, జగన్, భాస్కర్, సత్యనారాయణ, సుమలత, జ్యోతి, శారద పాల్గొన్నారు.

'లైన్' క్లియర్!



నందివనపర్తి- నస్దిక్‌సింగారం గ్రామాల మధ్యన ఫార్మాసిటీకి వెళ్లే రోడ్డు

- ఫార్మాసిటీ రోడ్డు విస్తరణకు ఓకే
- భూములు కోల్పోయే రైతుల అంగీకారం
- పరిహారం కింద ఎకరాకు రూ.24 లక్షలు, ఇంటి స్థలం

యాచారం: ఫార్మాసిటీ రోడ్డు విస్తరణకు లైన్ క్లియర్ అయింది. భూములు కోల్పోయే రైతులు తమకు న్యాయమైన పరిహారం చెల్లించాలని ఇన్నాళ్లు నిర్మాణ పనులకు అడ్డు తగులుతూ వస్తున్నారు. ఐదేళ్ల క్రితమే యాచారం నుంచి కందుకూరు మండలం మీరాఖాన్‌పేట వరకు, నందివనపర్తి నుంచి నక్కర్తమేడిపల్లి వరకు ఫార్మాసిటీ రోడ్డు వెడల్పు కోసం రూ.72 కోట్లు మంజూరయ్యాయి. టీఎస్ఐఐసీ నుంచి కావాల్సిన నిధులు మంజూరైనా రోడ్డుకిరువైపులా భూములు కోల్పోయే రైతులు మాత్రం అంగీకరించలేదు. తమ వ్యవసాయ భూములు ఎకరాకు రూ. 2 కోట్ల ధర పలుకుతున్నాయని రూ.50 లక్షల పరిహారమైనా ఇవ్వాలని డిమాండ్ చేస్తూ నిర్మాణ పనులకు అడ్డు తగిలారు. అప్పట్లో నందివనపర్తిలో నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణను సైతం అడ్డుకున్నారు. దీంతో రైతులపై కేసులు పెట్టి, జైలుకు కూడా పంపించారు. తమ భూములు ఇవ్వాలి.. పైగా తమపై కేసులు పెట్టి జైలుకు పంపిస్తారా అంటూ రైతులు మరింత మొండికేశారు. పరిహారం చెల్లింపు విషయంలోనూ అధికారుల నుంచి స్పష్టత లేకపోవడంతో ఐదేళ్లుగా రోడ్డు వెడల్పు పనులు నిలిచిపోయాయి. ఈ క్రమంలో ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి సూచన మేరకు నందివనపర్తికి చెందిన బీఎస్ఆర్ ట్రస్ట్ చైర్మన్ బిలకంటి శేఖర్‌రెడ్డి రోడ్డు విస్తరణకు భూములివ్వాలని రైతులకు నచ్చజెప్పి ఒప్పించారు. కొద్దిరోజుల క్రితం రైతులతో సమావేశమై సంతకాలు కూడా చేయించారు. దాదాపు వంద అడుగుల మేర రోడ్డు విస్తరణతో రోడ్డుకిరుపైపులా మిగిలి ఉన్న వ్యవసాయ భూమికి నాలుగింతల డిమాండ్ పెరుగుతుందనే ఆశతో రైతులు ఓకే చెప్పారు.

50 ఎకరాలకుపైనే ..

ఫార్మాసిటీ రోడ్డు విస్తరణలో భూములు కోల్పోయే రైతులకు ఎకరాకు రూ. 24 లక్షల పరిహారంతో పాటు, మీర్‌ఖాన్‌పేట హెచ్ఎండీఏ వెంచర్‌లో ఎకరా భూమికి 121 గజాల ప్లాటు ఇచ్చేలా అధికారుల నుంచి సమ్మతి అందింది. యాచారం నుంచి మీర్‌ఖాన్‌పేట వరకు, నందివనపర్తి నుంచి నక్కర్తమేడిపల్లి వరకు 70 మందికిపైగా రైతులకు చెందిన 50 ఎకరాలకుపైనే వ్యవసాయ భూమి రోడ్డు విస్తరణలో పోయే అవకాశం ఉంది. యాచారంలో రోడ్డు వెడల్పుతో దుకాణ సముదాయాలకు నష్టం జరిగే అవకాశం ఉన్న దృష్ట్యా నందివనపర్తి నుంచి నేరుగా సాగర్‌రోడ్డు సాయిశరణం ఫంక్షన్‌హాల్ ముందుకు రోడ్డు వెడల్పునకు అధికారులు భూ సర్వే చేశారు. నందివనపర్తిలో మీరాఖాన్‌పేట, నక్కర్తమేడిపల్లికి కలిసే రోడ్డు వద్ద జంక్షన్, సాగర్‌రోడ్డుపై సాయిశరణం ఫంక్షన్ హాల్ సమీపంలో మరో జంక్షన్ నిర్మించనున్నారు.

కేసులు ఎత్తేయాలి



రోడ్డు వెడల్పు కోసం నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణ సభలో భూములు ఇవ్వమని తేల్చి చెప్పాం. పరిహారంపై స్పష్టత కోసం అధికారులను ప్రశ్నించినందుకు మాపై కేసులు పెట్టారు. నందివనపర్తి–నస్దిక్‌సింగారం మధ్య సర్వే నంబర్ 32లో 3గుంటలు పో తుంది.నాతోపాటు అనేక మందిపై కేసులు పెట్టారు. వాటిని అధికారులు ఉపసంహరించుకోవాలి.

– కొండూరి రామనాథం, రైతు, నందివనపర్తి

సంతకాలు చేశాం



ఫార్మాసిటీ రోడ్డు వెడల్పు కోసం భూములు ఇవ్వడానికి అంగీకార పత్రాలపై సంతకం చేశాను. 162,163,158 సర్వే నంబర్లలో రెండు ఎకరాల వరకు వ్యవసాయ భూమి పోతుంది. ఎకరాకు రూ.24 లక్షల పరిహారం, ఎకరాకు 121 గజాల ప్లాటు ఇస్తారని ఒప్పించారు. పరిహారం విషయంలో అధికారులు ఆలోచన చేయాలి.

– కంబాలపల్లి మల్లారెడ్డి, రైతు, నందివనపర్తి

మంత్రి హరీశ్‌రావుకు ఘన స్వాగతం



మంత్రి హరీశ్‌రావుకు జ్ఞాపికను అందజేస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య

చేవెళ్ల: వికారాబాద్ జిల్లా పర్యటనకు వెళుతున్న మంత్రి హరీశ్‌రావుకు గురువారం చేవెళ్లలో ఎమ్మెల్యే కాలె యాదయ్య ఘనంగా స్వాగతం పలికారు. కాలె యాదయ్య ఆహ్వానం మేరకు మంత్రి హరీశ్‌రావు చేవెళ్లలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి వచ్చారు. అక్కడ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం నియోజకవర్గంలో ఆత్మీయ సమ్మేళనాలపై మంత్రి ఆరా తీశారు. నాలుగు మండలాల్లో సమావేశాలు పూర్తి చేశామని ఎమ్మెల్యే వివరించారు. పార్టీ కోసం ప్రతి ఒక్కరూ శ్రమించాలని మంత్రి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ పీ కృష్ణారెడ్డి, చేవెళ్ల, మొయినాబాద్, షాబాద్, శంకర్‌పల్లి మండలాలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌తోనే సమగ్రాభివృద్ధి



బీజేపీ నాయకులను పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

యాచారం: రాష్ట్ర అభివృద్ధికి కాంగ్రెస్, బీజేపీలు అడ్డుగా మారాయని, బీఆర్‌ఎస్‌తోనే సమగ్రాభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. మండలంలోని మొగుళ్లవంపు గ్రామానికి చెందిన 30మంది బీజేపీ శ్రేణులు గురువారం ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ప్రజల్లో విశ్వాసం కోల్పోయాయని అన్నారు. ప్రజల మధ్య చిచ్చు పెడుతున్నాయని మండిపడ్డారు. నియోజకవర్గంలో ఎనిమిదేళ్ల కాలంలో రూ. 2,500 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేసినట్లు తెలిపారు. అభివృద్ధిని చూసే బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారని అన్నారు. బీజేపీ యూత్ నాయకుడు సీ జయరాజ్, 43వ బూత్ అధ్యక్షుడు ఎన్ వెంకటేష్ మరి కొందరు పార్టీలో చేరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు సీ జంగమ్మ, బీఆర్‌ఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు రమేష్ గౌడ్, పీ పాషా, పీఏసీఎస్ చైర్మన్ రాజేందర్‌రెడ్డి, ఇబ్రహీంపట్నం వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ టీ మల్లేష్, నాయకులు కృష్ణ, శ్రీనువాస్‌చారి, శివ, రాజు, ఐపీఎస్ రెడ్డి, సాయిలు, వెంకట్‌రెడ్డి, కృష్ణ, వెంకటేష్, సాయి, శివ తదితరులు పాల్గొన్నారు.

హోంగార్డ్ బైక్ చోరీ

శంకర్‌పల్లి రైల్వే స్టేషన్ పార్కింగ్‌లో ఘటన

శంకర్‌పల్లి: స్థానిక రైల్వే స్టేషన్ పార్కింగ్‌లో హోంగార్డ్ నిలిపిన బైక్‌ను దొంగలు ఎత్తుకెళ్లారు. ఈ ఘటన బుధవారం రాత్రి చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. శంకర్‌పల్లి పరిధిలోని సింగాపురానికి చెందిన సీ నరేష్ వికారాబాద్ పోలీస్ స్టేషన్‌లో హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్నాడు. బుధవారం రాత్రి తన బైక్ (ఏపీ 28 బీఎస్ 1063)ను శంకర్‌పల్లి రైల్వేస్టేషన్ పార్కింగ్‌లో నిలిపాడు. విధులు ముగించుకొని గురువారం ఉదయం రైల్వే స్టేషన్‌కు వచ్చాడు. అక్కడ తన బైక్ కనిపించకపోవడంతో స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కాపరిని కట్టేసి గొర్రెల అపహరణ

యాచారం: గొర్రెల మంద కాపరిని కట్టేసి గుర్తు తెలియని వ్యక్తులు 10 గొర్రెలను అపహరించారు. వివరాలు ఇలా ఉన్నాయి.. మండలంలోని నక్కర్తమేడిపల్లికి చెందిన జీ రాములు, పీ బీరప్పలు నక్కర్తమేడిపల్లి - తక్కళ్లపల్లి గ్రామాల మధ్య గొర్రెల మందను ఏర్పాటు చేశారు. ఇద్దరికి చెందిన 200 గొర్రెలను అక్కడ ఉంచారు. బుధవారం రాత్రి మంద వద్ద పీ బీరప్ప నిద్రిస్తుండగా గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి అతన్ని మంచానికి కట్టేసి 10 గొర్రెలను ఎత్తుకెళ్లారు. తెల్లవారుజామున బీరప్ప తోటి కాపరి జీ రాములకు సమాచారం ఇచ్చాడు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ప్రసాద్ తెలిపారు.

యువకుడి అదృశ్యం

చేవెళ్ల: బ్యాంక్ పని మీద వెళ్లిన యువకుడు కనిపించకుండా పోయిన సంఘటన బుధవారం చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. ఎన్కేపల్లికి చెందిన కే ప్రసాద్‌గౌడ్(35) బుధవారం ఉదయం బ్యాంక్ పని మీద వెళుతున్నానని తల్లిదండ్రులకు చెప్పాడు. మధ్యాహ్నం వరకు రాకపోవడంతో ఫోన్ చేశారు. చేవెళ్లలో ఉన్నానని వస్తానని చెప్పాడు. సాయంత్రం ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ వచ్చింది. రాత్రి వరకు ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు గురువారం చేవెళ్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అక్రమ నిర్మాణం కూల్చివేత



ఇబ్రహీంపట్నం: అక్రమ నిర్మాణాలు చేపట్టరాదని, అలాంటి వాటిని కూల్చివేస్తామని మున్సిపల్ కమిషనర్ యూసుఫ్ హెచ్చరించారు. ఇబ్రహీంపట్నంలో అక్రమంగా నిర్మించిన ఓ ఇంటిని జేసీబీతో గురువారం కూల్చివేశారు. గొడవలు జరగకుండా పోలీసులను మోహరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. అన్ని అనుమతులు పొందిన తర్వాతే ఇళ్ల నిర్మాణం చేపట్టాలని సూచించారు. నిబంధనలు పాటించని వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పాలమూరు నీరు పారిస్తాం



మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు, చిత్రంలో ఎమ్మెల్యేలు ఆనంద్, రోహిత్‌రెడ్డి, ఎమ్మెల్సీ శ్రీనివాస్‌రెడ్డి

- ఎత్తిపోతల పనులు చివరి దశకు చేరుకున్నాయి
- గిరిజనులకు పది శాతం రిజర్వేషన్ల ఘనత కేసీఆర్‌దే
- మూడు నెలల్లో మెడికల్ కాలేజీ, ఆస్పత్రి సేవలు
- బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి హరీశ్‌రావు
- ఆనంద్‌ను దీవించండి
- రెండోసారి అసెంబ్లీకి పంపించండి

వికారాబాద్, మర్పల్లి: నిత్యం ప్రజల్లో ఉండే ఎమ్మెల్యే ఆనంద్‌ను మరోసారి ఆశీర్వదించి అసెంబ్లీకి పంపాలని ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. స్థానిక ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ మెతుకు ఆనంద్ అధ్యక్షతన గురువారం మర్పల్లి మండల కేంద్రంలో నిర్వహించిన పార్టీ ఆత్మీయ సమ్మేళనానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఇది ఆత్మీయ సమ్మేళనంలా లేదని, విజయోత్సవ సభలా ఉందని సంతోషం వ్యక్తంచేశారు. బీఆర్‌ఎస్ కార్యకర్తల పనితీరు, ఎమ్మెల్యే ఆనంద్‌పై ఈ ప్రాంత ప్రజలకున్న అభిమానానికి ఇదే నిదర్శనమని కొనియాడారు.

రూ.15 కోట్లతో ఆయుష్ ఆస్పత్రి

పాలమూరు ఎత్తిపోతల పథకాన్ని పూర్తిచేసి జిల్లాలో త్వరలోనే సాగు నీరు పారిస్తామని మంత్రి స్పష్టంచేశారు. ఇందుకు సంబంధించిన పనులు చివరి దశకు చేరుకున్నాయని తెలిపారు. త్వరలోనే కరివెన, ఉద్దండాపూర్ రిజర్వాయర్లను నింపుతామని స్పష్టంచేశారు. జిల్లాలో కాల్వల తవ్వకం పనులను కొద్ది రోజుల్లోనే ప్రారంభిస్తామని వెల్లడించారు. గిరిజనులకు పదిశాతం రిజర్వేషన్లు ఇచ్చిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానిదేనని వివరించారు. యాభై ఏళ్ల కాలంలో గత పాలకులు తెలంగాణకు 20 మెడికల్ కాలేజీలు ఇస్తే.. కేవలం ఎనిమిదేళ్లలో సీఎం కేసీఆర్ 37 కాలేజీలు ఏర్పాటు చేయించారన్నారు. రాష్ట్రానికి మూడు ఆయుష్ ఆస్పత్రులు రాగా.. ఇందులో ఒకటి వికారాబాద్‌లో ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఇందుకోసం రూ.15 కోట్లు వెచ్చించామన్నారు. వికారాబాద్‌లో కనీసం డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయని స్థితిలో ఆంధ్రా పాలకులు వదిలేయగా.. రూ.250 కోట్ల నిధులతో మెడికల్ కళాశాల, అనుబంధ ఆస్పత్రి, నర్సింగ్ కాలేజీ, సెంట్రల్ డ్రగ్ స్టోరేజీ సెంటర్ ఏర్పాటు చేసిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానికే దక్కిందన్నారు. త్వరలోనే వికారాబాద్‌కు సీటీ స్కానింగ్ మిషన్ మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. మెడికల్ కళాశాల ఏర్పాటుతో 600 పడకల ఆస్పత్రి, 150 మంది వైద్యులు అందుబాటులోకి వస్తారని తెలిపారు. మరో మూడు నెలల్లో వికారాబాద్‌లో మెడికల్ కాలేజీ, అనుబంధ ఆస్పత్రి సేవలు ప్రారంభమవుతాయని స్పష్టంచేశారు.

సీఎం కేసీఆర్‌ను ఒప్పిస్తా..

ఎమ్మెల్యే ఆనంద్‌తో పాటు స్థానిక నేతల కోరిక మేరకు మర్పల్లిలో రోడ్డు విస్తరణ, సెంట్రల్ లైటింగ్ సిస్టం కోసం రూ.10 కోట్లు ఇచ్చేలా సీఎం కేసీఆర్‌ను ఒప్పిస్తానని మంత్రి హరీశ్ హామీ ఇచ్చారు. బీజేపీ ఏమిచ్చిందో.. కాంగ్రెస్ రైతులను ఎంత కష్టపెట్టిందో అందరికీ తెలుసన్నారు. రైతుకు ఆత్మగౌరవం తెచ్చిన నాయకుడు కేసీఆర్ కాదా..? తెలంగాణ ఏర్పాటు తర్వాత భూముల ధరలు పెరిగింది వాస్తవం కాదా..? అని ప్రశ్నించారు. అందుకే కేసీఆర్‌ను మూడోసారి సీఎంగా చూద్దామన్నారు.

కుటుంబ సభ్యుల్లా కలిసి ఉందాం..

బీఆర్‌ఎస్ జిల్లా ఇన్‌చార్జ్, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. మన మధ్య ఏవైనా భేదాభిప్రాయాలు ఉంటే కూర్చుని మాట్లాడుకుందామని, అందరూ బీఆర్‌ఎస్ కుటుంబ సభ్యుల్లా కలిసి ఉండాలని పార్టీ కార్యకర్తలు, నాయకులకు సూచించారు. అభివృద్ధి, సంక్షేమంలో బీఆర్‌ఎస్‌కు ఎవరూ సాటిలేరన్నారు.

కేసీఆర్ రాకుంటే జిల్లా అయ్యేదా..?

పార్టీ జిల్లా అధ్యక్షుడు, స్థానిక ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ లేకుంటే.. సీఎం కేసీఆర్ రాకుంటే.. వికారాబాద్ జిల్లా అయ్యేదా..? మన జిల్లా చార్మినార్ జోన్‌లో కలిసేదా..? వికారాబాద్‌లో ఇంత అభివృద్ధి జరిగేదా..? అని ప్రశ్నించారు. జిల్లాకు మెడికల్, నర్సింగ్ కళాశాలలు, ఆయుష్ ఆస్పత్రి, డ్రగ్ స్టోరేజీ సెంటర్లు మంజూరు చేసిన సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావుకు కృతజ్ఞతలు తెలిపారు. తాండూరు ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి మాట్లాడుతూ.. వికారాబాద్ జిల్లా కు పాలమూరు నీటితో పాటు కోట్‌పల్లి ప్రాజెక్టు అభివృద్ధికి నిధులివ్వాలని కోరారు. మెడికల్ కాలేజీ ఏర్పాటుతో జిల్లా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందనున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ రాజుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రూ.3.6 కోట్లతో డ్రగ్ స్టోరేజీ కేంద్రం

వికారాబాద్‌కు మంజూరైన ఆయుష్ ఆస్పత్రితో పాటు సెంట్రల్ డ్రగ్ స్టోరేజీ సెంటర్ ను మంత్రి సబితారెడ్డి, ఎమ్మెల్యేలు ఆనంద్, యాదయ్య, మహేశ్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, కలెక్టర్ నారాయణ రెడ్డి,బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రద్ పటేల్‌తో కలిసి మంత్రి హరీశ్‌రావు ప్రారంభించారు.అనంతగిరి గుట్టపై పనులు కొనసాగుతున్న మెడికల్ కాలేజీ, అనుబంధ ఆస్పత్రులను సందర్శించారు.నిర్మాణ పనులు,బ్లాక్‌లను పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు.రూ.3.6 కోట్లతో సెంట్రల్ డ్రగ్ స్టోరేజీ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.అనంతరం గుట్టపై వెలిసిన అనంత పద్మనాభస్వామిని దర్శించుకున్నారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ రాహుల్‌శర్మ, డీఎంహెచ్‌ఓ పాల్వన్‌కుమార్, జెడ్పీ వైస్ చైర్మన్ విజయ్‌కుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల,వైస్ చైర్‌పర్సన్ శంషాద్‌బేగం, ఆర్డీఓ విజయకుమారి, ఎంపీపీ చంద్రకళ, బీఆర్‌ఎస్ నేత నాగేందర్‌గౌడ్ పాల్గొన్నారు.



వికారాబాద్‌లోని అనంతగిరి గుట్టపై ఆయుష్ ఆస్పత్రి, సెంట్రల్ డ్రగ్ స్టోరేజీ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రులు హరీశ్‌రావు, సబితారెడ్డి, ఎమ్మెల్యేలు, కలెక్టర్

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కొందుర్గు: మండల పరిధిలోని అప్పారెడ్డిగూడ గ్రామ శివారులో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. ఫరూఖ్‌నగర్ మండలం మొగిలిగిద్ద గ్రామానికి చెందిన దశరథ్ (40) ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. కాగా దశరథ్ ఆటోలో గురువారం రాత్రి కొందుర్గు నుంచి మొగిలిగిద్ద వైపు వెళ్తుండగా అప్పారెడ్డిగూడ గ్రామం వద్ద ఎదురుగా వస్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొట్టినట్లు స్థానికులు తెలిపారు. ఈ ప్రమాదంలో ఆటో నడుపుతున్న దశరథ్ అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం షాద్‌నగర్ ప్రభుత్వ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాక్టర్, ఆటో ఢీకొని మహిళ మృతి

నలుగురికి తీవ్ర గాయాలు

షాబాద్: ట్రాక్టర్, ఆటో ఢీకొన్న ప్రమాదంలో మహిళ మృతి చెందిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. షాబాద్ సీఐ గురువయ్య గౌడ్ కథనం మేరకు.. వెంకమ్మగూడ గ్రామానికి చెందిన మిద్దె అనసూయ(40) గురువారం నాగరగూడ సంతలో కూరగాయలు విక్రయించడానికి వచ్చింది. సాయంత్రం ఆటోలో వెంకమ్మగూడ గ్రామానికి వెళుతుండగా తాళ్లపల్లి గ్రామ సమీపంలో ఆటోను ట్రాక్టర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఐదుగురు మహిళలకు తీవ్ర గాయాలయ్యాయి. వారిని ఆసుపత్రికి తరలిస్తుండగా అనసూయ మార్గమధ్యలో మృతి చెందింది. మిద్దె లలిత పరిస్థితి విషమంగా ఉండడంతో ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. బోడ లక్ష్మమ్మ, మల్లమ్మ, అమృతకు స్వల్ప గాయాలయ్యాయి. వీరిని నాగరగూడలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

సమస్యలను పరిష్కరించండి

రాజేంద్రనగర్: అత్తాపూర్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో గురువారం కార్పొరేటర్ మోంద్ర సంగీతగౌరీశంకర్ పర్యటించారు. తేజస్వీ కాలనీలో అధికారులతో కలిసి స్థానిక ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సీసీ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, స్ట్రీట్ లైట్లు తదితర సమస్యలతో ఇబ్బందులు పడుతున్నామని ఆమె దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ సమస్యలకు కారణాలను గుర్తించి వీలైనంత త్వరగా వాటిని పరిష్కరించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు రాములు, నరహరి, రాజు, బుచ్చిరెడ్డి, చెన్నయ్య, ఎస్ఎస్ కృష్ణకిషోర్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

లైంగిక దాడి నిందితుడికి రిమాండ్



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పరమేశ్

కడ్తాల్: బాలికపై లైంగిక దాడికి పాల్పడిన గానుగుమార్ల తండా సర్పంచ్ భర్త మోత్యానాయక్‌ను అరెస్ట్ చేసి గురువారం రిమాండ్‌కు తరలించారు. ఆమనగల్లు సీఐ కథనం మేరకు.. తండాకు చెందిన సేనావత్ మోత్యానాయక్ బాలికపై లైంగిక దాడి పాల్పడడంతో బుధవారం బాధిత కుటుంబం కడ్తాల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్ట్ చేసి చర్లపల్లి జైలుకు తరలించినట్లు సీఐ తెలిపారు.

సర్పంచ్ భర్తపై సస్పెన్షన్ వేటు

కడ్తాల్: బాలికపై అఘాయిత్యానికి పాల్పడిన గానుగుమార్ల తండా సర్పంచ్ భర్త సేనావత్ మోత్యానాయక్‌ను బీఆర్‌ఎస్ పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు కే పరమేశ్ ఈ విషయాన్ని ప్రకటించారు. గురువారం కడ్తాల్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. బాలికపై అఘాయిత్యానికి పాల్పడినందుకు పార్టీ క్రమశిక్షణ చర్యలు తీసుకుందని తెలిపారు. సమావేశంలో రైతుబంధు మండల కోఆర్డినేటర్ వీరయ్య, ఎంపీటీసీ లచ్చి, నాయకులు మహేశ్, రామకృష్ణ, అంజి తదితరులు పాల్గొన్నారు.

సీబీఐటీలో కెమికల్ ఇంజినీరింగ్ పోటీలు

మణికొండ: గండిపేటలోని చైతన్య భారతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(సీబీఐటీ) కళాశాలలో ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కెమికల్ ఇంజినీర్స్, హైదరాబాద్ రీజనల్ కేంద్రం, సీబీఐటీ కెమికల్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ఇంటర్ కాలేజ్-2023 పేరిట గురువారం పోటీలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన హైదరాబాద్ రీజనల్ కేంద్రం చైర్మన్ డాక్టర్ సంజయ్ బరద్వాజ్ ఇన్నోవేషన్, ఎకోసిస్టం, ఇన్ ఇండియా అనే అంశంపై మాట్లాడారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం, జేఎన్‌టీయూ హైదరాబాద్, ఐఐఐటీ బాసర, బీవీఆర్ఐటీ, బిట్స్ పిలానీ హైదరాబాద్ క్యాంపస్, ఎన్ఐటీ వరంగల్, సీబీఐటీ విద్యార్థులు మోడల్ మేకింగ్, టెక్నికల్ క్విజ్, వ్యాస రచన, వ్యక్తిత్వం తదితర విభిన్న పోటీల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో సీబీఐటీ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రవీందర్‌రెడ్డి, కెమికల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డాక్టర్ ముకుంద వాణి, సమన్వయ కర్త డాక్టర్ కె. ప్రసాద్‌బాబు, విద్యార్థులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు

కేంద్ర ప్రభుత్వ పథకాలపై విస్తృత ప్రచారం



ఎర్రబోడలో పల్లె పలెకూ ఓబీసీ - ఇంటింటికి బీజేపీ కరపత్రాలను పంపిణీ చేస్తున్న నేతలు

రాజేంద్రనగర్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని రంగారెడ్డి అర్బన్ జిల్లా ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్ కార్యకర్తలకు సూచించారు. పల్లె పల్లెకు ఓబీసీ ఇంటింటికి బీజేపీ కార్యక్రమంలో భాగంగా గురువారం రాజేంద్రనగర్ డివిజన్ ఎర్రబోడలో బీజేపీ ఓబీసీ మోర్చా అధ్యక్షులు కాసోజు మల్లేష్‌చారి ఆధ్వర్యంలో కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా చూడాలన్నారు. ప్రతి నాయకుడు, కార్యకర్త ప్రజల్లో ఉంటూ వారి సమస్యల పరిష్కారం కోసం తగు చర్యలు చేపట్టాలన్నారు. పార్టీ బలోపేతమే లక్ష్యంగా పని చేయాలన్నారు. కార్యక్రమంలో రాజేంద్రనగర్ డివిజన్ బీజేపీ అధ్యక్షులు బాబురావు, ఓబీసీ జిల్లా కార్యవర్గ సభ్యులు కొమురయ్య, చేవెళ్ల పార్లమెంటు కన్వీనర్ నారగూడెం మల్లారెడ్డి, జిల్లా ఓబీసీ ఉపాధ్యక్షులు సత్యనారాయణ, నాయకులు నర్సింహ, సులిగే వెంకటేష్, వాసు, మల్లేష్ యాదవ్, విజయ్‌కుమార్, బిట్కూరి సిద్దేశ్వర్, సందీప్, ఎల్.వెంకటేష్, బి.శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.